## బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ



పుల్లారెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహం

ఉండవెల్లి, అక్టోబర్ 28: ఆధైర్యపడొద్దు.. పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే అబ్రహం బీఆర్ఎస్ నాయకుడికి భరోసా కల్పించారు. మండలంలోని తక్కశిల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పుల్లారెడ్డి అనారోగ్యంతో కర్నూలులోని దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అబ్రహం శనివారం దవాఖానకు వెళ్లి ఆయనను పరామర్శించారు.

## కల్యాణం.. కమనీయం



రథోత్సవంపై శ్రీదేవి, భూదేవీ సమేత ధన్వంతరి వేంకటేశ్వరుడు

అయిజ, అక్టోబర్ 28: ధన్వంతరి వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. మండలంలోని ఉత్తనూరులో శనివారం పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవీ సమేత ధన్వంతరి వేంకటేశ్వరస్వామి కల్యాణం వేద పండితుల మంత్రోచ్చరణలు.. మేళతాళాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ శ్రీవారి కల్యాణం కనుల పండువగా జరిపించారు. ఉదయం మూల విగ్రహంతోపాటు జనార్దనస్వామి, లక్ష్మీదేవికి అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. అనంతరం రథంపై ఆశీనులైన శ్రీవారు గ్రామంలోని పురవీధుల గుండా భాజాభజంత్రీలు, మేళతాళాలు.. భక్తుల గోవిందనామస్మరణల నడుమ ఊరేగారు. భక్తులు అశేషంగా పాల్గొని తరించారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన




పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రవీంద్ర

వడ్డేపల్లి, అక్టోబర్ 28: మండల పరిధిలోని రామాపురం, జిల్లెడుదిన్నె, తిమ్మాజిపల్లె, జక్కిరెడ్డిపల్లె, జూలెకల్ గ్రామాల్లో శనివారం ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా గుర్తించిన పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో రవీంద్ర పరిశీలించారు. విద్యుత్, ఫర్నీచర్, టాయిలెట్స్ తదితర సదుపాయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీవో తిరుపతన్న, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, పంచాయతీ కార్యదర్శి వినోద్ ఉన్నారు.

## స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి

అలంపూర్, అక్టోబర్ 28: ఓటర్లు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని సీఐ రాజు అన్నారు. శనివారం అలంపూర్ మండలంలో సమస్యాత్మక కేంద్రాలైన పోలింగ్ స్టేషన్లు క్యాతూర్, లింగనవాయి గ్రామాల్లో ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో అలంపూర్ ఎస్సై రమేశ్‌తో పాటు, 70మంది ప్రత్యేక పోలీసులు పాల్గొన్నారు.



క్యాతూర్‌లో పోలీసుల కవాతు

# ఆదర్శం.. మహర్షి వాల్మీకి జీవితం

అయిజ రూరల్/వడ్డేపల్లి/రాజోళి, అక్టోబర్ 28: రామాయణ రచయిత మహాకవి వాల్మీకి జయంతి వేడుకలను శనివారం మండల పరిధిలోని బింగిదొడ్డి, తూంకుంట, చిన్నతాండ్రపాడు, యాపదిన్నె, సంకాపురం, ఈడిగోనిపల్లి, వేణిసోంపురం, వెంకటాపురం, ఎక్లాస్‌పురం తదితర గ్రామాల్లో ఘనంగా జరుపుకొన్నారు. చిన్నతాండ్రపాడులో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకుడు సత్యం మాట్లాడుతూ వాల్మీకి రామాయణ కావ్యాన్ని రచించి లోకానికి అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల వాల్మీకి సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడులో శనివారం వాల్మీకీ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, తాలూకా కార్యదర్శి రాముడు, మద్దిలేటి తదితరుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరంఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే కొంకల గ్రామంలో సుధాకర్, కిష్టన్న, కృష్ణ,జల్లి పరశు, ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. వెంకట్రామనగర్‌లో ఆంజనేయులు, శ్రీను, మహేశ్, గోపాల్, సర్పంచ్ ఆంజనేయులు,ప్రకాశ్, నరసింహారెడ్డి, చాంద్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. శాంతినగర్ రామచంద్రానగర్‌లో జరిగిన వేడుకల్లో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కరుణ పాల్గొన్నారు. తనగల, రామాపురం తదితర గ్రామాల్లోనూ జయంతి వేడుకలు నిర్వహించారు.

రాజోళిలో వాల్మీకి జయంతి వేడుకలను శనివారం వాల్మీకులు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలంలోని వాల్మీకి సంఘం పెద్దలు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.



రాజోళిలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు



అయిజ రూరల్: చిన్నతాండ్రపాడులో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు



వడ్డేపల్లి: వెంకట్రామనగర్‌లో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

# చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత

అలంపూర్, అక్టోబర్ 28: చంద్రగ్రహణం కారణంగా అలంపూర్ క్షేత్రంలోని జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను శనివారం సాయంత్రం మూసివేశారు. మరుసటి రోజు ఆదివారం ప్రాతఃకాల ఆలయాల శుద్ధి అనంతరం ఉదయం 9 గంటలకు ఆలయం తెరువనున్నట్లు ఆలయ పాలక మండలి చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు, ఈవో పురేందర్‌కుమార్ తెలిపారు. శనివారం ఉదయం జోగుళాంబ ఆలయంలోని యాగశాలలో పౌర్ణమి సందర్భంగా చండీహోమం నిర్వహించినట్లు తెలిపారు.



జోగుళాంబ ఆలయాన్ని మూసివేస్తున్న దేవస్థాన సిబ్బంది

### బీచుపల్లి ఆలయం మూసివేత

ఇటిక్యాల, అక్టోబర్ 28: చంద్రగ్రహణం కారణంగా బీచుపల్లి క్షేత్రంలోని ఆంజనేయస్వామి ఆలయాన్ని శనివారం సాయంకాలం 5గంటలకు మూసివేయనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ప్రహ్లాదాచారి తెలిపారు. చంద్రగ్రహణం ఆదివారం తెల్లవారుజామున 1:08 గంటలకు (స్పర్శకాలం) ప్రారంభమై 2:47 గంటలకు (మోక్షకాలం) ముగియనుందన్నారు. గ్రహణం అనంతరం ఆదివారం ఉదయం 9గంటలకు ఆలయ సంప్రోక్షణ, బిందెసేవ, అభిషేకం, ఆకుపూజ కార్యక్రమాల తర్వాత స్వామివారి దర్శనం ఉంటుందన్నారు.

# మెనూ ప్రకారం భోజనంఅం దించాలి

మానవపాడు, అక్టోబర్ 28: విద్యార్థులకు భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని జెడ్పీ అదనపు ముఖ్యకార్యదర్శి ముసాయిదాబేగం ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని బోరవెల్లిలో ప్రభుత్వ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదుల్లో విద్యార్థులకు 1098పై అవగాహన కల్పించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. నర్సరీని పరిశీలించారు.



బోరవెల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు ముఖ్యకార్యదర్శి ముసాయిదా బేగం

## ఆర్డీఎస్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో

అయిజ, అక్టోబర్ 28: కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో తగ్గుతోంది. శనివారం ఇన్‌ఫ్లో 98 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 274 క్యూసెక్కులుగా నమోదైందని ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 193 క్యూసెక్కులు చేరుతుండగా, ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 5.7 అడుగుల మేర నీటిమట్టం ఉందని తెలిపారు.

***టీబీ డ్యాంకు నిలిచిన ఇన్‌ఫ్లో..***

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో నిల్ నమోదు కాగా, అవుట్‌ఫ్లో 8,906 క్యూసెక్కులు ఉంది. డ్యాంలో ప్రస్తుతం 35.326 టీఎంసీల నీరు నిల్వఉంది. 1633 అడుగుల గరిష్ఠ నీటి మట్టానికి గానూ, ప్రస్తుతం 1608.83 అడుగులకు చేరినట్లు టీబీ డ్యాం సెక్షన్ అధికారి రాఘువేంద్ర తెలిపారు.

## దుమ్ము రోడ్లపై నీళ్లు చల్లించాలి

అయిజ, అక్టోబర్ 28: రోడ్లపై దుమ్ము లేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని, మున్సిపాలిటీ ట్యాంకర్ల ద్వారా నిత్యం రెండుపూటలా నీళ్లు చల్లి దుమ్ము, ధూళి నుంచి రక్షించాలని వ్యాపారస్తులు మున్సిపల్ మేనేజర్ రాజేశ్‌ను కోరారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. తగు చర్యలు తీసుకుంటామని మేనేజర్ సమాధానమిచ్చారు. కార్యక్రమంలో పట్టణంలోని వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రాజోళి, అక్టోబర్ 28: మండల కేంద్రంలో తుంగభద్ర నది మధ్యలో వెలిసిన శ్రీ రామప్ప స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరశైవ కుటుంబ సభ్యులు శనివారం పౌర్ణమిని పురస్కరించుకుని అభిషేకాలు నిర్వహించి అడివి స్వామి ఆధ్యర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఇక్కడి స్వామి వారి దర్శనం చేసుకోవాలంటే నదిలో పుట్టి(అరిగిలి)లో వెళ్లాల్సి ఉంటుంది.